






మాగంటి పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తదితరులు

# జనహృదయ నేతకు కన్నీటి నివాళి

(మొదటిపేజీ తరువాయి)

### రాజకీయాల్లో తనకంటూ ముద్ర

మాగంటి గోపీనాథ్ 1983లో దివంగత నేత నందమూరి తారక రామారావుపై అభిమానంతో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 1992 వరకు తెలుగుదేశం అనుబంధ సంస్థ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం 1987, 1988 సంవత్సరాల్లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 1988 నుంచి 1993 వరకు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా, తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలుగుదేశం పార్టీ నుంచి జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంఐఎం అభ్యర్థి నవీన్ యాదవ్‌పై 9,242 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం 2018 ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డిపై 16,004 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2018లోనే శాసనసభలో పీఈసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన 2022 జనవరి 26న బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

### సినీ పరిశ్రమలోనూ ప్రత్యేక స్థానం

మాగంటి గోపీనాథ్ సినీ రంగంలోనూ తనకంటూ ప్రత్యేక ముద్ర వేశారు. సినిమాలపై ప్రత్యేక ఆసక్తి కనబర్చే మాగంటి.. నిర్మాతగా పలు చిత్రాలను తీశారు. 1995లో పాతబస్తీ, రవన్న (2000), భద్రాద్రి రాముడు (2004), నా స్టైలే వేరు (2009)లో సినిమాలు తీసి సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.

### పూర్తిగా విభిన్నమైన శైలి

అధికారం కోసం పూటకో పార్టీ మార్చే నేతలున్న ప్రస్తుత రాజకీయ రంగంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ది పూర్తిగా విభిన్నమైన శైలి. నమ్మిన నేతను వదిలిపెట్టి స్వార్థం కోసం వేరే పార్టీలోకి వెళ్లడం తనకు ఎంత మాత్రం ఇష్టం లేదంటూ అనేకసార్లు తన సన్నిహితుల వద్ద కుండబద్దలు కొట్టేవారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానిగా ఉన్న మాగంటి గోపీనాథ్ ఆయన రాజకీయ రంగప్రవేశంతో 1983 నుంచి పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. తొలిసారిగా 2014లో జూబ్లీహిల్స్ టికెట్ దక్కడంతో అసెంబ్లీలో అడుగుపెట్టిన మాగంటి గోపీనాథ్ అనంతరం చోటుచేసుకున్న పరిణామాల కారణంగా బీఆర్‌ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే. 32 ఏళ్ల పాటు ఒకే పార్టీలో పనిచేసిన తాను 2015లో పార్టీ మారడానికి కారణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపైనే తాము ఫోకస్ చేయాలనుకుంటున్నామని, తెలంగాణలో పార్టీ భవిష్యత్ కష్టమేనని పెద్దలు స్పష్టమైన అభిప్రాయానికి రావడమేనని ఎమ్మెల్యే మాగంటి పలు సందర్భాల్లో చెప్పేవారు.బీఆర్‌ఎస్‌లోకి రావడానికి ప్రధానమైన కారణం ఉద్యమ సారథి కేసీఆర్‌లోని మంచితనమే అని, తెలంగాణ వస్తే హైదరాబాద్‌లోని సీమాంధ్రుల పరిస్థితి ఏంటని ప్రశ్నలు ఉత్పన్నమైన తరుణంలో కేసీఆర్ పాలన భరోసా కల్పించిందని, అందుకే తాను బీఆర్‌ఎస్‌లో చేరానని పలు సందర్భాల్లో మాగంటి గోపీనాథ్ చెప్పేవారు. 2023 డిసెంబర్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలైన తర్వాత పార్టీ మారాలంటూ కాంగ్రెస్ నేతల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. తనను నమ్మి రెండుసార్లు టికెట్ ఇచ్చిన కేసీఆర్‌కు ఎట్టి పరిస్థితిలో ద్రోహం చేసే ప్రసక్తే లేదని మాగంటి స్పష్టం చేశారు. టికెట్ దక్కలేదని, కార్పొరేషన్ పదవులు దక్కలేదని, మంత్రి పదవి దక్కలేదని, పైరవీల కోసం పార్టీలు మారే నాయకులు ఉన్న ప్రస్తుత తరుణంలో 42 ఏండ్ల ప్రస్తానంలో ఒకే సారి పార్టీ మారిన మాగంటి గోపీనాథ్‌ది విలక్షణ శైలి అని ఆయన అభిమానులు, రాజకీయ పరిశీలకులు చెప్పుకుంటూ వచ్చారు.

## మాగంటితో 30 ఏళ్ల అనుబంధం

**కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**




మాగంటి ఇంటి వద్ద మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో ఎమ్మెల్యే మాధవరం

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 8: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం తనకు, బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మాగంటి గోపీనాథ్ భౌతికకాయాన్ని సందర్శించిన ఆయన నివాళులర్పించారు. రాజకీయాలలో 30 ఏళ్లుగా మాగంటి గోపీనాథ్‌తో కలిసి పనిచేశానని, తనకు మాగంటి అత్యంత ఆత్మీయుడని.. అతడిని కోల్పోవడం బాధాకరమన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి.. నియోజకవర్గ ప్రజల సమస్యల సాధనే లక్ష్యంగా పనిచేశారన్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నేతలు... బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలను వేధించడంతో తీవ్రమైన మనోవేదనకు గురైన మాగంటి వైద్యశాలలో చేరగా చికిత్స పొందుతూ కన్నుమూశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని మాధవరం కన్నీటి పర్యంతమయ్యారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

**ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**



ఆస్ట్రేలియా షీనా వాట్ ఎంపీకి బతుకమ్మ బోనం ఎత్తుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, జూన్ 8: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. కీసరలో ఆదివారం డాక్టర్ అంబేద్కర్ 175వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆస్ట్రేలియా డెలిగేషన్ మినిస్టర్స్, పార్లమెంట్ సెక్రటరీలు పాల్గొని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో బోనాలు, బతుకమ్మలతో ఆస్ట్రేలియా బృందానికి కీసర మహిళా నేతలు ఘన స్వాగతం పలికారు. ఆస్ట్రేలియా షీనా వాట్ ఎంపీకి మాజీ మంత్రివర్యులు మల్లారెడ్డి బోనం బతుకమ్మ ఎత్తారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా డెలిగేషన్ మినిస్టర్, పార్లమెంట్ సెక్రటరీలు ఇండియాకు వచ్చి కీసరలోని అంబేద్కర్‌కు జ్ఞానమాలను సమర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్.. ఆస్ట్రేలియా బృందానికి డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుర్రం మల్లారెడ్డి స్వచ్ఛంద సంస్థ చైర్మన్, ఆస్ట్రేలియా డెలిగేషన్ కన్వీనర్ గుర్రం శ్రీధర్‌రెడ్డి, ఆస్ట్రేలియా డెలిగేషన్ మినిస్టర్స్ పాలిన్ రిచర్డ్స్, పార్లమెంట్ సెక్రటరీ బెలిండా విల్సన్, జాలియన్ ఆడిసన్, అనిల్ కొలన్, మండల నేతలు నాయకపు వెంకటేశ్ ముదిరాజ్, గుర్రం మల్లారెడ్డి, సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్‌కు జ్ఞానమాల అనంతరం ఆస్ట్రేలియో బృందం కీసరగుట్టకు వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

## ఇబ్రహీంపట్నంలో టాటా షోరూమ్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న వీవీసీ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్

హైదరాబాద్ (తెలంగాణ) జూన్ 8, 2025: ప్రముఖ ఆటోమొబైల్ డీలర్రైన వీవీసీ గ్రూప్.. ఇబ్రహీంపట్నంలోని మన్నెగూడ ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో నూతన టాటా షోరూమ్‌ను ప్రారంభించింది. దాదాపు 10వేల స్క్వేర్‌ఫీట్ గల అతి విశాలవంతమైన షోరూమ్, సర్వీస్ సెంటర్‌ను ఆదివారం వీవీసీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీవీ రాజేంద్రప్రసాద్, టాటా మోటార్స్ జోనల్ మేనేజర్ సేల్స్ జయ్‌దీప్ గుప్త, రీజనల్ మేనేజర్ గోపీ, రీజినల్ కస్టమర్ కేర్ మేనేజర్ దీపక్ అగర్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీవీ రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. వీవీసీ మోటార్స్ నుంచి ఇబ్రహీంపట్నంలో షోరూమ్, సెర్వీస్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. వీవీసీ మోటార్స్ నుంచి ఇది 25వ అవుట్‌లెట్ అని అలాగే ఈ సర్వీస్ సెంటర్‌తో కలిపి 18 సర్వీస్ సెంటర్లను తెలంగాణలో నడుపుతున్నామని తెలిపారు. టాటా కార్, వాహనాలు కొనే ప్రతీ కస్టమర్‌కి ఉత్తమ సర్వీస్ అందించమమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ నెట్‌వర్క్ మేనేజర్ రామ్ మోహన్, టెరిటరీ సేల్స్ మేనేజర్ దీపక్, డీలర్ ప్రిన్సిపల్స్ వీరేన్ చౌదరి, విక్రమ్ ఆదిత్య, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో టాటా వారి సరికొత్త ఆల్ట్రోస్ కారును మార్కెట్లోకి విడుదల చేశారు.

# కార్యకర్తలంటే పంచ ప్రాణాలు



బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎలక్ట్రిక్ స్కూటీలను బహుమతిగా ఇచ్చిన మాగంటి (ఫైల్)

**సర్దార్ ఆత్మహత్యను**
**తట్టుకోలేకపోయిన మాగంటి**
**దిగులుతో సరిగా భోజనం చేయక**
**నీరసించి ప్రాణాల మీదకు..!**

వెంగళరావునగర్, జూన్ 8:కార్యకర్తలంటే ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు పంచ ప్రాణాలు. ఏ కష్టమొచ్చినా కార్యకర్తలకు తోడుండి అండగా నిలబడి.. అసలైన ప్రజా నాయకుడిగా ఎమ్మెల్యే మాగంటి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రజా సేవలో చురుగ్గా ఉండే బోరబండ బీఆర్‌ఎస్ మైనార్టీ డివిజన్ నాయకుడు సర్దార్ అంటే మాగంటికి ప్రత్యేక అభిమానం. సర్దార్ చేసే ప్రజాహిత కార్యక్రమాలకు మాగంటి వెన్నంటి ఉండి ప్రోత్సహించారు.

**200 మంది కార్యకర్తలకు స్కూటీలిచ్చి..**

పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు, ప్రజా సమస్యలపై పోరాటం చేసినప్పుడు కార్యకర్తలు కొందరు నడుచుకుంటూ రావడం, మరి కొందరు ఆటోలకు చార్జీలు పెట్టుకుని రావడాన్ని మాగంటి గమనించారు. పార్టీలో కష్టపడి పనిచేసే పేద, మధ్య తరగతికి చెందిన కార్యకర్తల కోసం తన సొంత డబ్బును వెచ్చించి 200 ఎలక్ట్రిక్ స్కూటీలను కొని ఇచ్చారు. ఇలా ఒక్కటేమిటి మహిళలకు చీరలు, మిక్సీలు పంచిపెట్టారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో ప్రభుత్వం నుంచి రూ.లక్షలు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎందరికో అపన్నులకు సాయం అందేలా కృషి చేశారాయన.

**సర్దార్ మృతితో కుంగిపోయి..**

బోరబండ ప్రజలకు తలలో నాలుకలా మెలిగే సర్దార్ బీఆర్‌ఎస్ లో సమర్థుడైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించాక..తనతో పాటు కాంగ్రెస్‌లోకి రావాలని సర్దార్‌పై బాబా ఒత్తిడి తెచ్చినా..నమ్ముకున్న బీఆర్‌ఎస్ లోనే సర్దార్ కొనసాగారు. ఈ నేపథ్యంలో బోరబండలో సర్దార్ ఇల్లు పునర్నిర్మించుకుంటుండగా..రూ.5 లక్షలు లంచం ఇవ్వాలని..లేకుంటే ఇల్లు కూల్చివేయిస్తామని బాబా పీఏ సప్తగిరి బెదిరింపులకు గురి చేశాడు. సర్దార్ ఇంటికి బాబాతో పాటు..అతని భార్య హబీబా సుల్తానా, పీఏ సప్తగిరి అనేకసార్లు వచ్చి బెదిరింపులకు గురి చేశారని సర్దార్ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. లంచం ఇవ్వకపోవడంతో సర్దార్ ఇంటిని బల్దియా అధికారులతో బాబా కూల్చి వేయించడంతో సర్దార్ కుంగిపోయి తన ఇంటి మూడో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఉదంతంతో బాబా దౌర్జన్యాలపై ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అలుపెరుగని పోరాటం చేశారు. పార్టీలకు అతీతంగా అందర్నీ ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమమే నడిపారు మాగంటి. ప్రధాన అనుచరుడు సర్దార్ ఆత్మహత్య మాగంటిని కలిచివేసింది. సమయానికి భోజనం తినకపోవడం, ఆరోగ్యంపై దృష్టి పెట్టకపోవడంతో మాగంటి నీరసించిపోయారు. గుండెపోటుకు గురయ్యారు. చికిత్స పొందుతూ.. ఆదివారం ఉదయం 5.45కు తుదిశ్వాస విడిచారు.

**మాగంటి పార్థీవదేహం వద్ద**
**బాబా డౌన్ డౌన్ అంటూ నినాదాలు**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ పార్థీవ దేహానికి నివాళులర్పించి.. వెళ్లేటప్పుడు అక్కడున్న మహిళా కార్యకర్తలు బాబా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బాబా అరాచకాలతో బలైన సర్దార్ ఆత్మహత్య మాగంటిని నిద్రాహారాలు లేకుండా కుంగేలా చేసిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.

# ఇక మాకు దిక్కెవరు..?

**కేటీఆర్, కవిత ముందు కన్నీటి పర్యంతమైన బోరబండ వాసులు**



బోరబండవాసులకు భరోసా ఇస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

వెంగళరావునగర్, జూన్ 8 : తోడబుట్టకున్నా.. అంతకు మించిన బంధం..మహిళా కార్యకర్తల్ని చెల్లెమ్మలు, అక్కలుగా ఆదరించి ఆప్యాయతానురాగాలు పంచారు బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్. బోరబండ వాసుల కష్టసుఖాల్లో తోడై నిలిచారు. మాగంటి ఆకస్మిక మృతి చెందడంతో మాదాపూర్‌లోని నివాసంలో మాగంటి గోపీనాథ్ పార్థీవదేహానికి బోరబండ వాసులు నివాళులర్పించారు. అక్కడికి వచ్చిన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావుతో తమగోడు వెల్లబోసుకున్నారు. కష్టజీవులైన బోరబండ వాసుల ఇళ్ల కూల్చివేతల్ని అడ్డుకోవడానికి మాగంటి చివరి దాకా పోరాడారని, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపారన్నారు. ఇక నుంచి బోరబండలో ఏ పేదోడి ఇల్లు కూల్చనియ్యనని.. ఎందాకైనా పోరాడుతానని మాగంటి చెబుతూ ఉండేవారని బోరబండ మహిళలు మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ జాగృతి నాయకురాలు కవిత దృష్టికి తీసుకెళ్లారు. బోరబండలో అరాచకాలు, దౌర్జన్యాలు పెట్రేగిపోయాయని..మాగంటి మృతితో మాకు అండ కూడా లేకుండా పోయిందని విలపించారు. 'మా బతుకులు ఆగమైపోతున్నాయి.. ఇక మాకు దిక్కులేకుండా పోయింద'ని బోరబండ బస్తీల మహిళలు రోదించారు.

### చెమ్మగిల్లిన చెల్లెమ్మలు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌ను పార్టీలోని మహిళా కార్యకర్తలైన ఆడపడుచులు ప్రేమగా గోపన్న అని పిలుచుకుంటారు. ఆడపడుచుల ఆ ప్రేమాభిమానాలే ఆయన్ని హ్యాట్రిక్ ఎమ్మెల్యేని చేశాయి. మూడుసార్లు వరుసగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అహర్నిశలు పేదోళ్ల గురించే మాగంటి ఆలోచనలు. ఈ గరీబోళ్ల కు ఇల్లు లేకుండా చేయాలనే కుట్రలు, కుతంత్రాలు పన్నిన స్వార్థ రాజకీయాలపై చివరిదాకా పోరాడారు. ఆ పోరాటంలో ఆయన తన ఆరోగ్యం క్షీణిస్తున్నా.. పట్టించుకోలేదని బోరబండ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకుని తమను రక్షించాలని వేడుకున్నారు. స్పందించిన కేటీఆర్ అండగా ఉంటామని భరోసా కల్పించారు. రోదిస్తున్న బాధిత మహిళలను కేటీఆర్ ఓదార్చారు. జూబ్లీహిల్స్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తామని స్పష్టంచేశారు.

# చేపమందు కోసం పోటెత్తారు

- ప్రజలతో కిక్కిరిసిన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్
- అరకొర ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి
- క్యూలైన్‌లో నిలబడిన 75 ఏళ్ల వృద్ధుడి మృతి
- ఆహారం సప్లై చేసిన స్వచ్ఛంద సంస్థలు




ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు కోసం పోటెత్తిన జన సందోహం

సుల్తాన్ బజార్, జూన్ 8: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిని కుటుంబం నిర్వహించే చేపమందు ప్రసాదం పంపిణీకి ఆదివారం ప్రజలు పోటెత్తారు. అయితే ప్రభుత్వ యంత్రాంగం చేపమందు ప్రసాదం కోసం విచ్చేసే ప్రజలకు అరకొర ఏర్పాట్లు చేపట్టడంతో ఇబ్బందులు తప్పలేదు. మత్స్యశాఖ అధికారులు 35 కౌంటర్లను ఏర్పాటుచేసి చేపమందు ప్రసాదం పంపిణీ చేపట్టారు. కాగా ఈ ప్రసాదం పంపిణీలో క్యూలైన్లలో నిలిచి ఉన్న 75 ఏండ్ల వృద్ధుడు గుండె పోటుతో పడిపోగా అక్కడే ఉన్న వైద్య శిబిరానికి తరలించి అత్యవసర వైద్య చికిత్స, సీపీఆర్ అందించినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అతడు మృతి చెందాడు. మరోవైపు పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీ కోసం విచ్చేసిన ప్రజలకు ఆహారం అందించి మానవత్వాన్ని చాటుకున్నాయి. రాత్రి 7 గంటల వరకు 47వేల చేప పిల్లల ప్రసాదం పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

**ఆస్తమా తగ్గుతుందని నమ్మకం..**

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేపమందు ప్రసాద పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు మధుయాష్కీ, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, బత్తిని కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం చాప ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృగశిర కార్తి రోజు చేప ప్రసాదం తినడం వల్ల ఆస్తమా వ్యాధి తగ్గుతుందని చాలామంది నమ్మకమని అన్నారు. 48 గంటలు నిరంతరాయంగా బత్తిని కుటుంబ సభ్యులతో పాటు అన్ని శాఖలు పనిచేస్తున్నాయని అన్నారు.

**బత్తిన సోదరులు నా సతీమణి బంధువులు..**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. చేపమందు ప్రసాదం కోసం గతంలో తన సతీమణి కుటుంబం ఢిల్లీ నుంచి వచ్చి చేపమందు తీసుకున్నారని గుర్తుచేశారు. బత్తిని కుటుంబం తన సతీమణి బంధువులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ బండారు దత్తాత్రేయ, కర్ణాటక ఎమ్మెల్సీ మంజునాథ్, కార్పొరేటర్ రాఖీ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు. మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, శ్రీనివాసు మాట్లాడుతూ.. ఒక్కో చేప ధర 40 రూపాయలుగా టోకెన్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. గతేడాది 60 వేల చేప పిల్లలను విక్రయాలు చెపట్టామని.. ఈ ఏడాది అంతే సంఖ్యలో ఇంచుమించు విక్రయాలు జరగవచ్చని వారు తెలిపారు.కాగా ఎగ్జిబిషన్ మైదానంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిటీ జాయింట్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ జాన్ డీసీపీ శిల్పవల్లి, అదనపు డీసీపీ ఆనంద్, అబిడ్స్ ఎసీపీ ప్రవీణ్ కుమార్, ఇన్స్పెక్టర్లు భరత్ కుమార్, ఏడుకొండలు బందోబస్తును పర్యవేక్షించారు.

## బ్రాహ్మణ యువతకు ఆటల పోటీలు

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): సనాతన ఎంట్రప్రెన్యూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో పాల్గొనాలనుకునే బ్రాహ్మణ యువతీయువకులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని అమ్రీత్ ముళ్లపూడి ఆదివారం ప్రకటనలో తెలిపారు. యువ ధ్వని యూత్ కార్నివాల్ పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 18 నుంచి 36 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. జూన్ 8 కూకట్‌పల్లి ప్లేగ్రౌండ్‌లో ప్రారంభోత్సవం ఉంటుందని.. అదేరోజు క్రికెట్ పోటీలు, 15న క్యారమ్స్, చదరంగం పోటీలు నిర్వహిస్తామని, 22న బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిలో విజేతలకు ప్రత్యేక సభ నిర్వహించి బహుమతులు అందజేస్తామని ముళ్లపూడి వెల్లడించారు.ఈ అవకాశాన్ని బ్రాహ్మణ యువత సద్వినియోగం చేసుకోవాలని ముళ్లపూడి సూచించారు.

# హైరిస్క్ ప్రెగ్నెన్సీకి ఆధునిక సాంకేతికతతో చికిత్స

**యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి**



వర్క్‌షాప్‌లో పాల్గొన్న యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి తదితరులు

మాదాపూర్, జూన్ 8: ప్రసూతి సమయంలో అత్యంత క్లిష్టమైన సందర్భం ఎదురైనప్పుడు తల్లీబిడ్డలను క్షేమంగా ఎలా కాపాడాలనే విషయమై అవగాన కల్పించడమే లక్ష్యంగా ఆదివారం మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్స్‌లో హై రిస్క్ ప్రెగ్నెన్సీ పై లైవ్ వర్క్‌షాప్‌తో పాటు జాతీయ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి విచ్చేసి యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణవేణి నాయినితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోరుకంటి మాట్లాడుతూ... హై రిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను ఏ విధంగా అధిగమించాలో ఈ వేదిక ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. విభిన్న వైద్య విభాగల నుంచి అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్య నిపుణులు హై రిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను అధిగమిస్తూ, నూతన మార్గదర్శకాలు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను మరింత సులభంగా, కచ్చితత్వంతో ఎలా నిర్వహించాలో వారి అనుభవాలను ఈ జాతీయ సదస్సులో పంచుకున్నారని తెలిపారు. ఇలాంటి లైవ్ వర్క్ షాపులు యువ వైద్యులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్, డాక్టర్ కృష్ణవేణి నాయిని మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్ షాప్‌లో హైరిస్క్ ప్రెగ్నెన్సీలో క్లిష్టమైన అంశాలపై లోతైన చర్చ జరిగిందని తెలిపారు. ఇందులో 500 మందికి పైగా గైనకాలజిస్టులు, సర్జన్ల తో పాటు యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ స్థలాలను నిర్భయంగా కొనవచ్చు

**వెస్టన్ డివిజన్ ఈఈ కిరణ్ బాబు**

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 8: కేపీహెచ్‌బీ కాలనీలో వేలంపాట పెట్టిన స్థలాలను నిర్భయంగా కొనుగోలు చేయవచ్చని.. ఈవిషయమై ఎలాంటి అనుమానాలు ఉన్నా... నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని హౌసింగ్ బోర్డు వెస్టన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కిరణ్‌బాబు స్పష్టం చేశారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో.. 'ఆ ప్లాట్లు కొంటే... ప్లాట్లు తప్పదా...?' అన్న శీర్షికతో శనివారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో వేలానికి పెట్టిన ప్లాట్ నంబర్ 28, 29కి సంబంధించి పశ్చిమ వైపు సరిహద్దును ఏర్పాటుచేసి ఇచ్చే బాధ్యత హౌసింగ్ బోర్డ్ దేనని స్పష్టం చేశారు. ఈ ప్లాట్లకు ఆనుకొని ఉన్న అంకుర వైద్యశాల, చర్చి, సాయి ఆయుష్ భవనంతో పాటు 7 భవనాలకు లేఅవుట్ ప్రకారం రోడ్డు సౌకర్యం పశ్చిమం వైపు ఉందని... తూర్పు వైపునకు వారికి ద్వారం లేదని తెలిపారు. వైన్‌షాప్ పక్కన ఉన్న స్థలం విషయంలో రహదారిసమస్య ఉందని, ఈ స్థలంతో పాటు కాలనీ 9వ ఫేజ్ లోని ఖాళీ స్థలాలకు మరో దఫా వేలంపాట నిర్వహిస్తామన్నారు. ప్లాట్ నంబర్ 23 పక్కన.. మెహఫిల్ హోటల్ భవనానికి పెట్టినటువంటి ఏసీ ఔటర్ ఫ్యాన్లను తొలగించడంతోపాటు సరిహద్దును నిర్ధారించి ఇచ్చే బాధ్యత హౌసింగ్ బోర్డు తీసుకుంటుందని తెలిపారు. హౌసింగ్ బోర్డులో వేలంపాటకు పెట్టిన స్థలాల విషయంలో ఏమైనా అనుమానాలు ఉంటే...సోమవారం కూకట్‌పల్లిలోని హౌసింగ్ బోర్డు వెస్టన్ డివిజన్ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని కోరారు. వేలానికి పెట్టిన ప్లాట్లు రాష్ట్ర హౌసింగ్ బోర్డు సంస్థ విక్రయించడం జరుగుతుందని ఈఈ కిరణ్‌బాబు తెలిపారు.